క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

చిన్నగూడూరు: ఈనెల 5నుంచి 9వ తేదీ వరకు శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నర్సింహులపేటలో జరగనుండగా మంగళవారం మండలంలోని ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యే రెడ్యానాయక్, ఆలయ కమిటీ సభ్యులు కలిసి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొల్లం రమేష్, కార్య నిర్వాహణాధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్రికెట్‌లో రాణిస్తున్న యువకుడు



కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం శివారు బూరుగుచెట్టు తండా జీపీ పరిధిలోని బీమా తండాకు చెందిన యువకుడు భర్మావత్ మధు అంతర్జాతీయ క్రికెట్‌లో రాణిస్తున్నాడు. ఫిబ్రవరి 21వ తేది నుంచి 24వ తేదీ వరకు నేపాల్‌లోని పోఖ్రా పట్టణంలో మూడు దేశాల క్రికెట్ టోర్నమెంట్ అండర్–19 విభాగంలో ఇండియా జట్టు తరఫున ఆడి మంచి ప్రతిభ కనపరిచాడు. ఈ టోర్నమెంట్‌లో ఇండియా జట్టు విజయం సాధించి బంగారు పతకం సాధించింది.

కరాటేలో గోల్డ్‌మెడల్



బయ్యారం: ఇటీవల ఖమ్మం జిల్లా కల్లూరులో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండలంలోని బాల్యా తండా గ్రామానికి చెందిన భూక్యా హర్షిత గోల్డ్‌మెడల్ సాధించింది. తండాకు చెందిన రమేష్–విజయల ద్వితీయ కుమార్తె హర్షిత కొత్తగూడ మండలంలో 9 వ తరగతి చదువుతుంది. సర్పంచ్ లక్ష్మిసుధాకర్‌నాయక్, కోచ్ పాడుగు సుధా అభినందించారు.

స్థానికులకే పట్టం కట్టాలి

తొర్రూరు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో స్థానికులకే పట్టం కట్టాలని మాజీ టీపీసీసీ సభ్యుడు ముత్తినేని సోమేశ్వర్ రావు అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సోమేశ్వర్‌రావు మాట్లాడుతూ టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన దయాకర్ రావు ఆరేండ్ల కాలంలో ఏం అభివృద్ధి చేశాడని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, జిల్లా నాయకులు కందాడి అచ్చిరెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ధీకొండ శ్రీనివాస్, నాయకులు లక్ష్మయ్య, లక్ష్మణ్, రాంబాబు పాల్గొన్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయం

నెల్లికుదురు: మూడు మద్యం షాపులు సిండికేటుగా ఏర్పడి ఎమ్మార్పీ ధరకంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని మద్యం ప్రియులు ఆందోళన చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు నిద్ర మత్తువీడడం లేదని సీపీఐ (ఎంఎల్) న్యూడెమక్రసీ డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయన్న మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు.

వ్యర్థాలు వేస్తే చర్యలు

డోర్నకల్: చికెన్, మటన్ దుకాణదారులు రోడ్లపై వ్యర్థాలను వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చికెన్, మటన్ దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణంలోని మాంసం దుకాణాల ముందు కుక్కలు గుంపులు సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయంటూ తమకు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఇక నుంచి వ్యర్థాలను రోడ్లపై వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ మేనేజర్ ఉదయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ అహ్మద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మరిపెడ: కేసీఆర్ పాలనలోనే పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదో వార్డులో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూరరవికుమార్, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారదరవీందర్, మున్సిపల్ కౌన్సిలర్ ప్రగతిశ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

గార్ల: అటవీ సంరక్షణ 2022 నియమాలు ఆదివాసీల మెడలకు ఉచ్చులుగా మారాయని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న ఆరోపించారు. మంగళవారం గార్లలో జరిగిన ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతన అటవీ సంరక్షణ నియమాల పేరుతో కొత్త చట్టంను తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 20వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, పుల్లన్న, సక్రు, బాబు, లింగన్న, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే మానవ మనుగడ

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సైన్స్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం పాఠశాలల్లో విద్యార్థులు ఎగ్జిబిట్స్ తయారు చేసి ప్రదర్శించారు. ఉత్తమ ప్రాజెక్టుల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడారు. సైన్స్‌తోనే మానవమనుగడ అని, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: సైన్స్ ఎగ్జిబిట్‌లను సందర్శిస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్



మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న డీఈఓ రామారావు



కురవి: ఆశ్రమ పాఠశాలలో సైన్స్ ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్‌లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



మరిపెడ: విద్యార్థుల ఆవిష్కరణలు తిలకిస్తున్న గ్రంథాలయ చైర్మన్ నవీన్, తదితరులు



పెద్దవంగర: అవుతాపురంలో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



మహబూబాబాద్: ఎస్పీకి ఎగ్జిబిట్‌లపై వివరిస్తున్న విద్యార్థులు



గంగారం: సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



గూడూరు బాలికల హైస్కూల్‌లో ఎగ్జిబిట్‌లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



కొత్తగూడ: విద్యార్థికి బహుమతి అందజేస్తున్న హెచ్ఎం లక్ష్మీనారాయణ



మహబూబాబాద్ రూరల్: మాధవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



కేసముద్రం: ఎగ్జిబిట్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు..

హామీలు అమలు చేయని ప్రభుత్వాలు

చిన్నగూడూరు: దేశసంపదను అదానీ చేతుల్లో అమ్మకానికి దోచిపెడుతూ, ప్రజారంగ వ్యవస్థలను ప్రధాని మోదీ నిర్వీర్యం చేస్తున్నారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి విమర్శించాడు. మంగళవారం మండలంలోని గుండంరాజుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మండల సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా నల్లు సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ, అదానీల బంధం ఎలాంటిదో దేశ ప్రజలకు అర్థమైందని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ హామీలు అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పోగుల శ్రీనివాస్‌గౌడ్, మండల కార్యదర్శి గంజి శేషాద్రిరెడ్డి, సహాయ కార్యదర్శి దొంతు స్టాలిన్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి

నూతన కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాలనీ కమిటీ భవనంలో మంగళవారం తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో రియల్టర్స్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రంగారావు హాజరై మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎనుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బత్తుల శ్రీనివాస్ యాదవ్ ఉపాధ్యక్షులుగా గంటా శ్రీనివాస్, రమేష్ గౌడ్, నాయక్, ఉమా, కృష్ణ, మురళి, నాజర్, వెంకన్న కోశాధికారిగా దాచేపల్లి సుధాకర్, రాష్ట్ర కార్యదర్శిగా రాయల కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షులుగా మధుసూదన్‌రెడ్డి, మానుకోట టౌన్ అధ్యక్షులుగా దుర్గేష్, ఉపాధ్యక్షులుగా కృష్ణయ్య, ఎండి షకిల్, ప్రచార కార్యదర్శిగా సూర్యకిరణ్, టౌన్ కార్యదర్శి రమేష్‌లను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

కొనసాగిన నిరసనల వెల్లువ



మహబూబాబాద్ అర్బన్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మహిళలు



మహబూబాబాద్ అర్బన్: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని, ర్యాగింగ్‌ను అరికట్టాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ర్యాగింగ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రీతి ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

– మహబూబాబాద్ అర్బన్/డోర్నకల్/పెద్దవంగర



డోర్నకల్: నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

కేసముద్రం: మండల కేంద్రంలో మేరు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా టైలర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా కుట్టు మిషన్ సృష్టి కర్త విలియమ్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేరు సంఘం మండల అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి సురేందర్ పాల్గొన్నారు.

గార్ల: గార్లలో టైలర్స్ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం టైలర్స్ ఆధ్వర్యంలో పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలోసంఘం మండల అధ్యక్షుడు దేవా సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, టైలర్స్ పాల్గొన్నారు.

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో మంగళవారం టైలర్స్ దినోత్సవం సందర్భంగా జెండాను బీఆర్ఎస్ నాయకుడు తోట రమేష్ ఎగురవేశారు. టైలర్స్ సంఘం అధ్యక్షుడు వి.శ్రీధర్, శేషు పాల్గొన్నారు.



కేసముద్రం: జెండా ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

ప్రజలకు భరోసా కల్పించడానికే యాత్రలు

తొర్రూరు రూరల్: రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకే ప్రజాగోస–బీజేపీ భరోసా యాత్రలు చేపడుతున్నట్లు పార్టీ రాష్ట్ర నాయకుడు పెదగాని సోమయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వెలికట్ట, గుర్తూరు, చీకటాయపాలెం, తొర్రూరులోని రిక్షా కాలనీల్లో కార్నర్ మీటింగ్‌లను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పెదగాని సోమయ్య మాట్లాడారు. సమావేశాల్లో పార్టీ పట్టణ, రూరల్ మండలాల అధ్యక్షులు పల్లె కుమార్, బొచ్చు సురేష్, జిల్లా నాయకులు రాంమోహన్‌రెడ్డి, కుమార్, శ్రీమాన్, శంకర్, రవిబాబు, రాజేష్ పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగురవేస్తాం..

దంతాలపల్లి: నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేస్తామని మానుకోట జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ప్రజాగోస బీజేపీ భరోసా యాత్ర నిర్వహించారు. కార్యక్రంలో నాయకులు సాయి కుమార్, లక్ష్మణ్‌నాయక్, పూర్ణచందర్ రెడ్డి, సరెడ్డి రాణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

నల్లబెల్లం స్వాధీనం

తొర్రూరు: గుడుంబా తయారీకి వినియోగించే నిషేధిత నల్లబెల్లం, ఇతర తయారీ పదార్థాలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు స్వాధీనపర్చుకున్న ఘటన మంగళవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ టి.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాంచారిమడూరు, హరిపిరాల, సోమారం, నెల్లికుదురు, తొర్రూరు ప్రాంతాల్లో గుడుంబా తయారీ పదార్థాలు రవాణ చేస్తున్నారన్న సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆయా ప్రాంతాల్లో దాడులు చేపట్టారు. తనిఖీల్లో 1.50 క్వింటాళ్ల నల్లబెల్లం, 30కిలోల పటిక, 30 లీటర్ల నాటుసారా లభ్యమైంది. తొమ్మిది మందిని తొర్రూరు తహసీల్దారు ఎదుట, ముగ్గురిని నెల్లికుదురు తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు. రవాణాకు వినియోగిస్తున్న వాహనాన్ని సీజ్ చేశారు. దాడుల్లో ఎస్సైలు కిషోర్ బాబు, రజిత, సిబ్బంది బాలు, కుమారస్వామి, హరిబాబు, వెంకన్న, వీరస్వామి, రాజు, రమణ, సుమన్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఆభరణాల పర్స్ అప్పగింత

గార్ల: ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జేబులో బంగారు ఆభరణాలు ఉన్న పర్స్ జారిపోవడంతో, సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు పర్స్ ఎత్తుకెళ్లిన వ్యక్తిని గుర్తించి, గంటల వ్యవధి లోనే తిరిగి బాధితుడికి అప్పగించిన సంఘటన మంగళవారం గార్లలో చోటుచేసుకుంది. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని గ్యామాతండాకు చెందిన గూగులోత్ భీమా ద్విచక్ర వాహనంపై గార్లకు వస్తుండగా రూ.60వేల విలువ గల బంగారు ఆభరణాలు కలిగి వున్న పర్స్ జేబులో నుంచి జారిపోయింది. వెంటనే బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బ్లూకోల్ట్ కానిస్టేబుల్ మంగీలాల్ వెంటనే గార్లలోని సీసీ కెమెరాలు చెక్ చేయగా, డోర్నకల్ మండలం రాజుతండాకు చెందిన భూక్యా బాసు కింద పడ్డ పర్స్‌ను తీసుకొని వెళ్లిపోయాడు. అతని వాహనం నంబర్ ప్లేట్ ఆధారంగా అడ్రస్ తెలుసుకొని భూక్యా బాసును పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పర్స్‌ను స్వాధీనం చేసుకొని భీమాకు అందజేశారు. ఏఎస్సై రవీందర్, కానిస్టేబుల్ మంగీలాల్‌ను ఎస్సై బానోత్ వెంకన్న అభినందించాడు.

ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధం

డోర్నకల్: మండలంలోని ఫకీరాతండా గ్రామంలో మంగళవారం బానోత్ లచ్చాకు చెందిన ఏడు ఎకరాలు, తేజావత్ శాంతకు చెందిన ఎకరం వరపంట సాగుకు సంబంధించిన ఎండు గడ్డి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. ప్రమాదంలో లక్ష రూపాయల విలువైన వరిగడ్డి దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన క్షతగాత్రులు

కేసముద్రం: కేసముద్రం విలేజ్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో మంగళవారం ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడ మండలానికి చెందిన భిక్షపతి అనే వ్యక్తి భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఇనుగుర్తి మండలం చీన్యాతండాకు జీపీకి చెందిన చంద్రమౌళి బైక్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. వీరిని వెంటనే 108లో మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని సాలార్ తండాతోపాటు పలు కాలనీల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్ డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ టి.ప్రసన్నరాణికి వినతి పత్రం అందజేశారు. జమున, శ్రీను, నరేష్, రేణుక, రజిత తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది వేతనాలు ఇవ్వాలి

నెల్లికుదురు: గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది వేతనాలను అందించి ఆదుకోవాలని సీపీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంపీడీఓ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఖాళీ విస్తరాకులతో సిబ్బంది నిరసన వ్యక్తం చేసి ఎంపీడీఓ శేషాద్రికి వినతిపత్రం అందించారు.

పబ్లిక్ టాయిలెట్లను నిర్మించాలి

బయ్యారం: నిత్యం పలు గ్రామాల నుంచి వచ్చిపోయే వారితో సందడిగా ఉండే బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో పబ్లిక్ టాయ్‌లెట్లను నిర్మించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కొత్త వినయ్‌బాబు ప్రభుత్వాన్ని మంగళవారం డిమాండ్ చేశారు.

నట్టల నివారణతో జీవాలు సురక్షితం

పెద్దవంగర: నట్టల నివారణ మందుతో మేకలు, గొర్రెలు సురక్షితంగా ఉంటాయని మండల పశువైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని చిట్యాల గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో జీవాలకు నట్టల మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏలు ప్రభాకర్, సుమన్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎంపీపీ తూర్పాటి అంజయ్య అన్నారు. మండలంలోని పోలెపెల్లి గ్రామంలో మండల పరిషత్ నిధుల్లో రూ.1.5 లక్షలతో ఏర్పాటు చేసిన బోర్‌మోటార్‌ను మంగళవారం ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే అంకూస్, సర్పంచ్ పాండుల యాకయ్య, వార్డు సభ్యుడు రాంమూర్తి, మాజీ ఎంపీటీసీలు సోమలింగం, భాస్కర్, కార్యదర్శి నాగార్జున పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ పూజలు

గూడూరు: మండలంలోని కోబల్‌తండాలో మంగళవారం దుర్గాదేవి పూజలను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కోబల్‌తండా పరిధిలోని ప్రజలు ప్రతీ ఇంట్లో బోనం తయారు చేసి, మేళతాళాల నడుమ బయలుదేరి దుర్గాదేవికి నైవేద్యం సమర్పించారు. సర్పంచ్ మూడు కమలాశ్రీనివాస్, ఎంపీటీసీ, గ్రామపెద్దలు ఏర్పాట్లు చేశారు.

ఒకే రోజు రెండు సుఖప్రసవాలు

మరిపెడ: మరిపెడ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో మంగళవారం ఒకే రోజు రెండు సుఖప్రసవాలు చేసినట్లు వైద్యాధికారి గుగులోతు రవికుమార్ తెలిపారు. అనంతరం వారికి కేసీఆర్ కిట్లు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మహబూబా, అశ్విని, ఆశవర్కర్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నెల్లికుదురు: జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు నోడల్ అధికారి రజిత కోరారు. మండలంలోని రాజులకొత్తపల్లి గ్రామంలో మంగళవారం కేసముద్రం డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో శ్రీరామగిరి సొసైటీ చైర్మన్ గుండ వెంకన్న అధ్యక్షతన ప్రజలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య, ఎంపీటీసీ గోవర్ధన్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ సిందు, సుపర్‌వైజర్ రాజేష్, డైరెక్టర్ రాజిరెడ్డి, రైతు కోఆర్డినేటర్ వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

డోర్నకల్: ప్లాస్టిక్ సంచుల వాడకంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని డోర్నకల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పాటి రమేష్ పేర్కొన్నారు. పలు వీధుల్లో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత సంచులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు నరేష్, యశోధర్‌జైన్, నరేష్‌పాట్ని, గోపాల్‌వర్మ, యుగేందర్ పాల్గొన్నారు.

మంత్రిపై వ్యాఖ్యలకు పశ్చాత్తాపం

తొర్రూరు: మంత్రి దయాకర్‌రావుపై చేసిన వ్యాఖ్యలకు పశ్చాత్తాపపడుతున్నానని కాంగ్రెస్ మండల యువజన విభాగం నాయకుడు పంజాల మురళీగౌడ్ అన్నారు. ఫిబ్రవరి 15న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాలకుర్తిలో చేపట్టిన పాదయాత్రలో పాల్గొని మంత్రి దయన్నపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై మంగళవారం డివిజన్ కేంద్రంలోని సమావేశం నిర్వహించారు. దయన్న సహకారంతోనే తాను ఉద్యోగ శిక్షణ పొందానని, అనారోగ్యం బారిన పడిన తాను దయన్న ఆర్థిక చేయూతతో కుదుటపడ్డానన్నారు. దయన్నపై చేసిన వ్యాఖ్యలకు మనస్ఫూర్తిగా క్షమాపణ కోరుతున్నానన్నారు.

మల్లయ్య ఆశయ సాధనకు పాటుపడాలి

తొర్రూరు రూరల్: గంగ పుత్రుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిన గొప్ప నాయకుడు కేవీఎల్ మల్లయ్య ఆశయాల సాధనకు నిరంతరం పాటుపడాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సింగరం శ్రీనివాస్, రైతు బంధు కోఆర్డినేటర్, మాజీ సర్పంచ్ సింగరం కుమార్ అన్నారు. మండలంలోని గుర్తూరు గ్రామంలో మత్స్యశాఖ సొసైటీ అధ్యక్షుడు పిల్లి నాగరాజు అధ్యక్షతన కేవీఎల్ మల్లయ్య సంస్మరణ సభను మంగళవారం నిర్వహించారు. సమావేశంలో మత్స్య సొసైటీ మాజీ అధ్యక్షుడు సింగరం శ్రీనివాస్, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, డైరెక్టర్లు కిరణ్, ప్రశాంత్, మురళి పాల్గొన్నారు.

బైరి నరేష్‌పై దాడి అప్రజాస్వామికం

తొర్రూరు: నాస్తికుడు బైరి నరేష్‌పై మతతత్వ శక్తుల దాడి అప్రజాస్వామికమైందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రవి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత భావాలు వ్యక్తీకరించే హక్కు ఉందని దాన్ని ఉల్లంఘించే అధికారం ఎవరికీ లేదన్నారు. బైరి నరేష్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, నాయకులు బందు శ్రీను, గుగులోతు శ్రీను, వెంకన్న, ప్రసాద్, నరసింహులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యలు పరిష్కరిస్తాం

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో డ్రెయినేజీ సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 11వ వార్డులో మంగళవారం వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగంతో కలిసి పర్యటించి స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కోఆప్షన్ సభ్యులు రాంభద్రం, నాయకులు వరలక్ష్మి, మల్లేశం, వెంకటేష్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

కురవి: మండల కేంద్రం శివారు రేకుల తండా జీపీలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యుడు బండి వెంకటరెడ్డి ప్రారంభించారు. కంటి వెలుగు కార్యక్రమానికి జెడ్పీటీసీ రూ.1000 అందజేశాడు. కార్యక్రమంలో మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ బానోత్‌వినోద్, ఎంపీటీసీ గుగులోత్ నరేష్, ఉపసర్పంచ్ శంకర్, కార్యదర్శి శశిధర్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పెద్దవంగర: కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ శ్రీరాం జ్యోతిర్మయి సుధీర్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని కొరిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక ఎంపీటీసీ ఎర్ర సబితతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ముజీబుద్దీన్, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

మహబూబాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొట్లాని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, రైతు సంఘం పట్టణ కార్యదర్శి హేమనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల ఐక్య వేదిక సదస్సులో వారు మాట్లా డారు. మార్చి 17న జరిగే బస్సు జాత సభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు సురేష్, అలివేలు, లక్ష్మణ్, చారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తీవ్రవాదంపై మోదీ ఉక్కుపాదం

డోర్నకల్: ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపి దేశంలో శాంతియుత పరిస్థితులు నెలకొనేలా ప్రధాని నరేంద్రమోదీ కృషి చేశారని బీజేపీ నియోజకవర్గ ప్రభారి ఈవీ రమేష్ అన్నారు. స్థానిక గాంధీ సెంటర్‌లో మంగళవారం ప్రజా గోస, బీజేపీ భరోసా కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఇస్లామిక్ తీవ్రవాదాన్ని అరికట్టడంలో మోదీ సఫలమయ్యారని తెలిపారు. త్వరలో బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రానుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాసాని నాగేశ్వర్‌రావు, రెహమాన్, సునీల్‌పాట్ని, జయరాజ్ పాల్గొన్నారు.